ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మిఠాయిలు తినిపించి అభినందనలు తెలియజేశారు.

మైలవరం: మండలంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరైన వారిలో బాలురు 271 మంది, బాలికలు 296 మంది, మొత్తం 567 మంది ఉన్నారు. వీరిలో బాలురు 103 మంది ఉత్తీర్ణులు కాగా బాలికలు 168 మంది ఉన్నారు. మొత్తం 567 మందికి గాను 47.80 శాతం ఉత్తీర్ణులయ్యారు. కాగా ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో పోల్చితే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పోటీగా మార్కులు సాధించడం విశేషం.

మెరుగైన ఫలితాలు

నూజివీడు: పదో తరగతి ఫలితాల్లో నూజివీడు డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు గతం కంటే మెరుగైన ఫలితాలను సాధించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు.

ఇబ్రహీంపట్నంలో 64 శాతం..

ఇబ్రహీంపట్నం: మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల టెన్త్ క్లాస్ పరీక్షల్లో 64 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాశాఖ అధికారులు ఒక ప్రకటనలో ప్రకటించారు. మొత్తం 1,426 మంది పరీక్షలకు హాజరుకాగా, ఫస్ట్ డివిజన్ 737మంది, సెకండ్ 144, థర్డ్ 43 మంది సాధించారు. 924 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

తిరువూరులో 39 శాతం..

తిరువూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 39 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 125 మంది బాలికలు పరీక్ష రాయగా, 62 మంది ఉత్తీర్ణులయ్యారు. కోకిలంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 32 మంది పరీక్ష రాయగా, 16 మంది, తిరువూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 104మందికి 49 మంది, మునుకుళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 50 మందికి 25 మంది, అంబేడ్కర్ గురుకులంలో 79మందికి 42 మంది, ముష్టికుంట్లలో 33 మందికి 23 మంది, గానుగపాడు జెడ్పీ హైస్కూల్లో 16మందికి 8మంది, మల్లేల జెడ్పీ హైస్కూల్లో 22మందికి 14 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ రామకృష్ణ తెలిపారు.

గంపలగూడెంలో 72 శాతం..

గంపలగూడెం: పదో తరగతి పబ్లిక్‌పరీక్షల ఫలితాల్లో గంపలగూడెం మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలనుంచి 72శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖాధికారి బీ సోమశేఖర్‌నాయక్ తెలిపారు. 19 పాఠశాలల నుంచి 832మంది హాజరుకాగా 588 మంది పాసయ్యారు.

ముసునూరులో 49 శాతం

ముసునూరు: మండలంలో 49 శాతం విద్యార్థులు పదో తరగతిలో ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓ పి.రత్నకుమార్ తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు మండలంలోని ఏడు జెడ్పీ స్కూల్స్ నుంచి 380 మంది విద్యార్థులు హాజరు కాగా, శనివారం వెలువడిన ఫలితాల్లో 187 మంది పాస్ కాగా, 193 మంది ఫెయిల్ అయినట్లు తెలిపారు. ముసునూరులోని ఆంధ్రప్రదేశ్ గురుకుల బాలికల విద్యాలయం నుంచి 80 మంది బాలికలు హాజరు కాగా 77 మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ వై.శ్రీదేవి తెలిపారు.

చాట్రాయిలో 58 శాతం..

చాట్రాయి: 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 58.28 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. చనుబండ జెడ్పీ హైస్కూల్లో 50 మంది పరీక్షలు రాయగా 32 మంది పాస్ అయ్యారు.

ఎ.కొండూరులో 69శాతం

ఏ.కొండూరు: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 69 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓ రాజశేఖర్ శనివారం తెలిపారు.

పది పరీక్షల్లో 50 శాతం ఉత్తీర్ణత

ఆగిరిపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 373 మంది పరీక్షలకు హాజరుకాగా 193 మంది విద్యార్థులు 50 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ పి.రత్నకుమార్ శనివారం తెలిపారు. ఆగిరిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 144 మంది పరీక్షలకు హాజరుకాగా 77 మంది విద్యార్థులు 53 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాలకు చెందిన ముల్లంగి రూబెన్ 547 మార్కులతో మండల ప్రథమ స్థానం, 523 మార్కులతో పి.మణికంఠ ద్వితీయ స్థానం సాధించినట్లు హెచ్ఎం పుష్పలత తెలిపారు. అదేవిధంగా ఈదర జెడ్పీ పాఠశాలలో 80 మందికి 34 మంది, ఈదులగూడెం జెడ్పీ పాఠశాలలో 61 మందికి 35 మంది, అడవినెక్కలం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 57 మందికి 34 మంది, ఎం.సూరవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 31 మందికి 13 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

రెడ్డిగూడెంలో 60 శాతం..

రెడ్డిగూడెం: మండలంలో 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో 60శాతం ఉత్తర్ణత సాధించినట్లు ఎంఈఓ పి.రఘురామ్ శనివారం తెలిపారు. మద్దులపర్వ ఏపీ మోడల్ స్కూల్లో 70 మంది విద్యార్థులకు గాను 50 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు.

రంగాపురం అంబేద్కర్ గురుకుల పాఠశాలనందు 79 మందికి గాను 62 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

విస్సన్నపేటలో 72 శాతం..

విస్సన్నపేట: మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన పదోతరగతి విద్యార్థులు 72.60 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ చదల రామకృష్ణ శనివారం తెలిపారు.

పాఠశాలను తనిఖీ చేసిన విద్యాశాఖ కమిషనర్



ఏ.కొండూరు: మండలంలోని కంభంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం రాత్రి విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ తనిఖీ చేశారు. పాఠశాలకు చేరిన జగనన్న విద్యా కానుకను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభించకముందే అన్ని పాఠశాలలకు జగనన్న విద్యాకానుక పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్, బెల్టులు షూ పాఠశాలలకు చేరాయన్నారు. పాఠశాలలు పునఃప్రారంభం అనంతరం విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి, వారికి ఎటువంటి ఇబ్బందులు పడకుండా అందించాలని ఆదేశించారు. కంభంపాడు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి రక్తహీనత కలిగిన విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందుతుందా లేదా అనే విషయం అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజశేఖర్, హెచ్ఎం ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సాయివ్రతం



గంపలగూడెం: గంపలగూడెం శిరిడి సాయి ధ్యాననిలయంలో వైశాఖమాసం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా శనివారం సామూహిక సాయివ్రతం ఆచరించారు. రామాలయం అర్చకులు దేవయజనం శ్రీధరాచార్యులు, రామాచార్యుల ఆధ్వర్యంలో 30మంది మహిళలు వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



మైలవరం: పారిశుద్ధ్య కార్మికులు వారి ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మైలవరం సబ్ బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ బి. శివహరి ప్రసాద్ తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మైలవరం సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అందజేసిన హెల్త్ హైజనిక్ కిట్లను స్థానిక పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు 50 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యం కాపాడటానికి ఈ కిట్లు ఉపయోగపడతాయన్నారు. బ్రాంచ్ కార్యదర్శి, కోశాధికారి గూడూరు నాగిరెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో కూడా వారి సేవలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రసాద్ పాల్గొన్నారు.

డీఎల్పీఓగా సుందరి బాధ్యతల స్వీకరణ



నూజివీడు: నూజివీడు డీఎల్పీఓగా ఎంపీఎస్ సుందరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు దెందులూరు ఇఓపీఆర్డీగా, నూజివీడు ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేసిన ఆమెను పదోన్నతిపై నూజివీడు డీఎల్పీఓగా నియమించడంతో విధుల్లో జాయిన్ అయ్యారు. ఇన్‌చార్జి డీఎల్పీఓ నుంచి ఆమె బాధ్యతలను తీసుకున్నారు. కార్యాలయ సిబ్బంది కొత్త డీఎల్పీఓకి స్వాగతం పలికారు.

8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఈనెల 8 నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించనున్నట్లు గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ తెలిపారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను శనివారం ఠాగూర్ గ్రంథాలయంలోని ఆమె కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జమల పూర్ణమ్మ మాట్లాడుతూ.. వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వేసవి సెలవుల్లో విజ్ఞానం, వినోదం అందించే ఇలాంటి శిబిరాలకు పంపాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, గ్రేడ్ – 3 గ్రంథ పాలకురాలు వై.ధనలక్ష్మి, రికార్డ్ అసిస్టెంట్ కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'భక్తిగాన సుధ'



విజయవాడ కల్చరల్: గుడిపాటి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాళ్ళపాక అన్నమాచార్యుని జయంతి సందర్భంగా దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో నిర్వహించిన భక్తిగాన సుధ కార్యక్రమం స్వర రాయ యుక్తంగా సాగింది. గుడిపాటి జయరాం సుధాకర్ ఆధ్వర్యంలో కొప్పరపు ఉమాబలరాం, మల్లాది స్వాతి, అయ్యప్పన్, శ్రీనిధి, సింధూ భక్తి గీతాలతో పాటు అన్నమయ్య రచించి స్వరపరచిన సంకీర్తనలను మధురంగా ఆలపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి జ్యోతిని వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. అన్నమయ్య సంకీర్తనలు తెలుగు భాషా వీచికలుగా అభివర్ణించారు. ఆ బాలగోపాలం అన్నమయ్య సంకీర్తనలను మధురంగా పాడుకుంటారన్నారు. 600 ఏళ్ల క్రితం రాసిన కీర్తనలను నేటికి ఆలపిస్తున్నామని చెప్పారు. ఆయన కీర్తనల్లో భక్తి భావంతో పాటు సామాజిక అంశాల ప్రస్తావన కనిపిస్తుందన్నారు. జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్, వ్యాపారవేత్త గుడిపాటి దత్తు పాల్గొన్నారు. గాయని వడ్డాది కామేశ్వరి నిర్వహించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే రక్షణనిధి

ఏ.కొండూరు: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి పేర్కొన్నారు. మండలంలోని వల్లంపట్ల గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ గ్రామంలో పలు రకాల ప్రభుత్వ పథకాల ద్వారా 538 కుటుంబాలకు రూ.7.47కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ఈ గ్రామంలో సచివాలయ పరిధిలోని పలు సమస్యలు పరిష్కారానికి రూ.20లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే జీళ్లకుంట, వల్లంపట్ల గ్రామాల్లో కల్వర్టు నిర్మాణానికి మరో రూ.10లక్షలు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. డ్రెయినేజీ సమస్య వెంటనే పరిష్కరించాలని, ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు భూక్య గనియా, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మీ, సర్పంచ్ జూపల్లి రాజేష్, ఎంపీటీసీ సభ్యుడు సర్సారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు చెన్నారావు, ఎంపీడీఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



వల్లంపట్ల గ్రామంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ఆగిరిపల్లి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తహసీల్దార్ ఎం.ఉదయ్‌భాస్కరరావు, ఎంపీడీఓ కె.వాణి పేర్కొన్నారు. మండలంలోని ఎస్.ఏ.పేటలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. సదస్సులో అధికారులు మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండిన తరువాతే వివాహం చేయాలని, పదో తరగతి అయిపోయిన తరువాత ఆడపిల్లలకు చిన్న వయస్సులో వివాహాలు చేస్తే ఇబ్బందులకు గురవుతారన్నారు. నూజివీడు ఐసీడీఎస్ సీడీపీఓ నూరాణి మాట్లాడుతూ బాల్య వివాహాలపై అంగనవాడీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ బాల్య వివాహాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఈదర పీహెచ్‌సీ వైద్యులు నాగజ్యోత్స్న, నరేంద్రకృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శివకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు నిర్మలకుమారి పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్

ఉబ్బసం వ్యాధిపై అవగాహన అవసరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉబ్బసం వ్యాధిపై ప్రజలకు అవగాహన అవసరమని ఫిజీషియన్ డాక్టర్ కె.హరీష్ తెలిపారు. బెంజిసర్కిల్ సమీపంలోని వాసవ్య నర్సింగ్ హోమ్‌లో శనివారం ఉబ్బసం వ్యాధిపై ఆరోగ్య సదస్సు జరిగింది. ఈ సదస్సులో డాక్టర్ హరీష్ మాట్లాడుతూ.. ఉబ్బసం ఏ వయస్సు వారికైనా రావచ్చునని, దానికి ప్రధాన కారణం ఎలర్జీ అని చెప్పారు. దుమ్ముధూళి, పూల పుప్పొడి, పెంపుడు జంతువుల వెంట్రుకలు ఉబ్బసానికి కారణాలన్నారు. చల్లగాలి, కొన్ని ఆహార పదార్థాలు, మానసిక వత్తిడి, కొన్ని రకాల మందులు, ధూమపానం, రకరకాల ఇన్ఫెక్షన్లు, వ్యాయామం కూడా ఉబ్బసం తత్వం ఉన్న వాళ్లకి దానిని ప్రకోపించేటట్లు చేస్తాయన్నారు. వ్యాధి రావడానికి కారణాలను గుర్తిస్తే చాలా వరకూ అదుపులో ఉంచుకోవచ్చని చెప్పారు. ఉబ్బసం వచ్చిన వారిలో ప్రధానంగా ఆయాసం, పిల్లికూతలు ఉంటాయన్నారు. అలాగే ఛాతిలో నొప్పి, నిద్రపట్టక పోవడం, తలనొప్పి, అలసట, దగ్గు, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఉబ్బసాన్ని స్పైరోమీటర్ టెస్టు ద్వారా నిర్ధారణ చేసుకోవచ్చునని తెలిపారు. సదస్సుకు డాక్టర్ సమరం అధ్యక్షత వహించగా, డాక్టర్ మారు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ హరీష్, పక్కన వైద్యులు సమరం, మారు

చాంగురే బంగారు రాజా కడుపుబ్బ నవ్విస్తుంది

చిత్ర కథానాయకుడు కార్తీక్ రత్నం

లబ్బీపేట(విజయవాడతూర్పు): చాంగురే బంగారు రాజా సినిమా ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తుందని ఆ చిత్రహీరో కార్తీక్‌రత్నం అన్నారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా శనివారం విజయవాడ నగరానికి విచ్చేసిన చిత్ర బృందం ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక్ రత్నం మాట్లాడుతూ ప్రముఖ హీరో రవితేజ చాంగురే బంగారు రాజా చిత్రాన్ని నిర్మించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రముఖ కమెడియన్ హీరో సునీల్ తమ చిత్రానికి వాయిస్ ఓవర్ ఇచ్చారని, ఆయన వాయిస్‌తో వచ్చిన ట్రైలర్‌కి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఈ చిత్రంలోని సన్నివేశాలను దర్శకుడు చాలా చక్కగా తీశారని, ప్రేమకులను కచ్చితంగా ఆకట్టుకునే విధంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హీరోయిన్ నిస్సీ మాట్లాడుతూ నా తొలి చిత్రానికి హీరో రవితేజ నిర్మాతగా వ్యవహరించడం సంతోషంగా ఉందన్నారు. తనకు, హీరోకు మధ్య వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తాయన్నారు. దర్శకుడు సతీష్‌వర్మ మాట్లాడుతూ ఈ వేసవిలోనే సినిమా రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. చిన్న చిత్రమైనా ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకుంటుందన్నారు. ఈ సమావేశంలో నిత్య, జోష్ రవి, పుష్ప రవి తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న చాంగురే బంగారు రాజా హీరో కార్తీక్‌రత్నం

భారీ వర్షం

మైలవరం: మైలవరంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈ వర్షంతో మండలంలోని వాగులు పొంగి ప్రవహించాయి. మైలవరం సమీపంలోని పులివాగు, కొండవాగులో వరద నీరు ఒక మోస్తరుగా ప్రవహించగా, చంద్రాల వాగులో వరద నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో రోడ్డుపై కూడా ప్రవహించడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. స్థానిక మార్కెట్ యార్డులో రైతులు ఆరబెట్టుకున్న ధాన్యం, మొక్కజొన్నలు కొంత వరకు తడిసిపోయాయి.

ఏరియా ఆస్పత్రి తనిఖీ



నూజివీడు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని ఏపీ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్ శనివారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయన ఆస్పత్రి ఆవరణ, అత్యవసర విభాగం, లేబర్ వార్డు, సర్జికల్ వార్డు, జనరల్ వార్డులతో పాటు ఆపరేషన్ థియేటర్ పరిశీలించారు. వార్డులలో రోగులను అడిగి ఆస్పత్రిలో అందుతున్న చికిత్స, సేవల వివరాలను తెలుసుకున్నారు. ఆస్పత్రి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ సూపరింటిండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్, వైద్యులను అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆస్పత్రి నిర్వహణను ఇలాగే కొనసాగించాలన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలనను పాటించి పేదలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని సూచించారు.

రేపటి నుంచి వేసవి ఉచిత శిక్షణ

ఇబ్రహీంపట్నం: శాఖ గ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి జూన్ 16వ తేదీ వరకు వేసవి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు శాఖ గ్రంథాలయాధికారి దీపిక శనివారం తెలిపారు. చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లిష్, పేపర్ క్రాఫ్ట్స్, కథలు తదిత అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రోజు ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా అలీఖాన్

నూజివీడు: నూజివీడు ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఎల్.అలీఖాన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన ఎంపీడీఓ ఎంపీఎస్ సుందరి డీఎల్పీఓగా ప్రమోషన్ రావడంతో ఆ స్థానంలో పట్టణంలోని పంచాయతీరాజ్ ఈఈ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న అలీఖాన్‌ను పూర్తి అదనపు బాధ్యతలతో నియమించారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చక స్వాములు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధాన అర్చకులచే సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియం ఆవరణలో నిర్వహించిన శ్రీశ్రీనివాస కల్యాణోత్సవం శనివారం కనులపండువగా జరిగింది. తొలుత ఇందిరానాయక్‌నగర్‌లో ఏర్పాటుచేసిన యాగశాలలో మహా గణపతి హోమం, చండీ హోమం, పూర్ణ హోమాలను చేపట్టారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, శ్రీనివాసరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం యాగశాల నుంచి స్టేడియం ఆవరణ వరకూ ఉత్సవ మూర్తులను అత్యంత వైభవంగా ఊరేగించారు. తిరుమలలో మాదిరిగా టీటీడీ ప్రధాన అర్చకులు శ్రీభూదేవి సమేత తిరుమలేశ్వరునికి వసంతోత్సవం, శ్రీనివాస కళ్యాణ వైభోగాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఏపీఐడీసీ చైర్మన్ బండి పుణ్యశీల, శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్పొరేటర్లు ఇసరపు దేవి, ఎండీ షాహీనా సుల్తానా, అలంపూరు విజయలక్ష్మి, ఉమ్మడి రమాదేవి, నాయకులు బొప్పన భవకుమార్, ఇసరపు రాజు తదితరులు పాల్గొన్నారు.

తగిన వేతనం పొందేలా పనిచేయాలి

వినగడప(గంపలగూడెం): ఉపాధి పనుల్లో పాల్గొనే కూలీలు రోజువారీ తగిన వేతనం పడేలా పనిచేయాలని ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. మండలంలో వినగడపలో ఉపాధిహామీ పథకంలో చేపట్టిని చెరువు ఫీడర్ చానల్ పూడిక తీత పనులను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎంపీడీఓ కూలీలతో మాట్లాడుతూ సమస్యలను అడిగి తెల్సుకున్నారు. కాగా మండలంలో నిర్వహిస్తున్న 203 పనుల్లో 8,532 కూలీలకు ఉపాధి చూపినట్లు ఎంపీడీఓ తెలిపారు. ఏపీఎం వేల్పుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో ఉద్రిక్తత

ఇబ్రహీంపట్నం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌ను టీడీపీ నాయకులు దూషించడమే కాకుండా జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు నల్లమోతు ప్రసన్నబోసును గేటుకు కట్టేస్తామని హెచ్చరించిన నాయకులపై వైఎస్సార్ సీపీ నాయకులు కన్నెర్రజేశారు. టీడీపీ నాయకుడు కొత్తపల్లి ప్రకాష్ ఇంటికి వెళ్లేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు శనివారం సిద్ధమయ్యారు. దీంతో ఇబ్రహీంపట్నంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ లోపు కొత్తపల్లి ప్రకాష్ కొందరు టీడీపీ నాయకులతో పోలీస్ స్టేషన్‌కు చేరుకుని తనకు రక్షణ కల్పించాలని వేడుకున్నాడు. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉండటంతో ఏ క్షణాన ఏమి జరుగుతుందో అనే ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనపై వైఎస్సార్ సీపీ, టీడీపీ నాయకులు పరస్పరం పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసుకున్నారు.



టీడీపీ నాయకుడు ఇంటికి వెళ్లేందుకు సిద్ధమైన వైఎస్సార్ సీపీ నాయకులను అడ్డుకున్న పోలీసులు

పాడిరైతుల సంక్షేమానికి కృషి

వినగడప(గంపలగూడెం): పాడిరైతుల సంక్షేమానికి కృష్ణా మిల్క్‌యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని ఆ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. 'పాడి రైతుల సంక్షేమం మన మతం' కార్యక్రమంలో మండలంలోని వినగడప పాల ఉత్పత్తిదార్ల సహకార సంఘాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి ఆయన మాట్లాడారు. మిల్క్ యూనియన్ ద్వారా 10 శాతం వెన్న పాలకు లీట రుకు రూ.80 చెల్లిస్తున్నామన్నారు. కల్యాణమస్తు, క్షీర బంధు, ప్రతిభ పథకాల గురించి వివరించారు. పశువులు ఎదకు రావడానికి యూనిట్ వారీ సబ్సిడీపై అందజేస్తున్న సెమన్‌ను రైతులు వినియోగించుకోవాలన్నారు. తద్వారా పశువులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన దూడలు జన్మిస్తాయన్నారు. పాడి దిగుబడి కూడా పెరుగుతుందన్నారు. పాడిఉత్పత్తి పెరుగుదలకు రైతులు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. యూనియన్ జిల్లా ట్రస్ట్ సభ్యులు పీ సత్యనారాయణ, తిరువూరు పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ సాంబశివమూర్తి, గంపలగూడెం పీపీసీఎస్ అధ్యక్షులు పీ ఆంజనేయులు, వినగడప, ముష్టికుంట్ల, కొత్తపల్లి సంఘాల అధ్యక్షులు రావి భాస్కరరావు, రంగారావు, వీరారెడ్డి, సూపర్‌వైజర్ ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చలసాని ఆంజనేయులు

కల్యాణమస్తు కానుక అందజేత

కొత్తగూడెం(మైలవరం): మైలవరం మండలం కొత్తగూడెం పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం పాల ఉత్పత్తిదారు అయిన వేమిరెడ్డి సంజీవరెడ్డి కుమారుని వివాహం ఈ నెల మూడో తేదీన జరిగింది. నూతన దంపతులకు పాల ఉత్పత్తిదారుల యూనియన్ తరఫున కల్యాణమస్తు పథకంలో భాగంగా రూ. 20వేలు విలువ చేసే నాలుగు గ్రాముల బంగారు నాణేలు శనివారం యూనియన్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ మేనేజర్ టి.యశ్వంత్, సంఘం అధ్యక్షుడు అప్పిడి సాంబిరెడ్డి, సూపర్‌వైజర్ గోపీకృష్ణ పాల్గొన్నారు.



లబ్ధిదారుకు కల్యాణమస్తు కానుక అందజేస్తున్న నాయకులు